నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌సీపీడీసీఎల్–11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ, బౌద్ధానగర్, అంబర్‌నగర్, లలితానగర్, వారాసిగూడ తదితర ప్రాంతాల్లో 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, జామాయి ఉస్మానియా ఫీడర్ పరిధిలో ఎస్‌బీహెచ్ కాలనీ, జమిస్తాన్‌పూర్, అంబర్‌నగర్ తదితర ప్రాంతాల్లో 11.30 గంటల నుంచి 1.30 వరకు, విద్యానగర్ ఫీడర్ పరిధిలో అడిక్‌మెట్, విద్యానగర్ బ్లడ్‌బ్యాంక్, వడ్డెర బస్తీ, ఎస్ఆర్టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు, సుందర్‌నగర్ ఫీడర్ పరిధిలో కృష్ణానగర్, నెహ్రూనగర్, బోన్స్ ఫ్యాక్టరీ, కాచిగూడ కమేలా తదితర ప్రాంతాల్లో 4 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సాంకేతిక విద్యలో నాణ్యత పెంపుపై దృష్టి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం సాంకేతిక విద్యలో నాణ్యత పెంపుపైదృష్టి సారించినట్లు ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం అన్నారు. మంగళవారం ఓయూ క్యాంపస్ ఠాగూర్ ఆడిటోరియంలో ఏఐసీటీఈ అవగాహన సదస్సు జరిగింది. ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ఏఐసీటీఈ వైస్ చైర్మన్ డాక్టర్ అభయ్‌జెరే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

నాలా పనులకు మోక్షమెప్పుడో ?

- రెండున్నరేళ్లుగా కొనసాగిన డైవర్షన్ పనులు
- నిలిచిపోవడంతో అధ్వానంగా ప్రధాన రహదారి
- పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు


మూన్ కేఫ్ వద్ద ఆగిపోయిన నాలా డైవర్షన్ పనులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పద్మకాలనీ నుంచి నల్లకుంట హెరిటేజ్ సూపర్‌మార్కెట్ మీదుగా ఫీవర్ ఆసుపత్రి వెనుక గేటు వరకు నిర్మించనున్న నాలా డైవర్షన్ పనులు పూర్తిగా ఆగిపోయాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2021లో సుమారు రూ.72 కోట్లతో ప్రారంభమైన ఈ డైవర్షన్ పనులు రెండున్నరేళ్లుగా కొనసాగాయి. గత 10 నెలల క్రితం మూన్‌కేఫ్ వరకు నాలా డైవర్షన్ పనులను పూర్తి చేశారు. అక్కడ నుంచి ఫీవర్ ఆసుపత్రి వెనుక భాగంలోని శ్రీరామ్‌నగర్ బస్తీ వరకు నిర్మించనున్న పనులను నిలిపేశారు. దీంతో మూన్ కేఫ్ నుంచి శ్రీరామ్‌నగర్ బస్తీ వరకు ప్రధాన రహదారి మొత్తం అధ్వానంగా తయారైంది.

ఎటు చూసినా గుంతల మయంగా..

ఎటు చూసినా పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. బాగ్‌లింగంపల్లి నుంచి నల్లకుంటకు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో మూన్ కేఫ్ వద్ద ఉన్న మూలమలుపు రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.


నల్లకుంట వరకు అధ్వానంగా ప్రధాన రహదారి

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు..

గత 10 నెలలుగా నాలా నిర్మాణ పనులు ఆగిపోయి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానిక ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రెండు నియోజకవర్గాలకు సంబంధించింది కావడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఎన్నికల సమయంలో ఎమ్మెల్యేలను నాలా పనులపై ప్రశ్నించారు. త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడేమో పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఇరు ఎమ్మెల్యేలు నాలా డైవర్షన్ పనులు, ప్రధాన రహదారి సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులకు అనేకసార్లు విన్నవించినా పట్టించుకోలేదు..



నాలా డైవర్షన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, ఎమ్మెల్యేలకు అనేకసార్లు మొరపెట్టుకున్నా.. ఫలితం లేకుండా పోయింది. రెండున్నర ఏళ్లుగా పనులు కొనసాగించి మధ్యలోనే నిలిపేశారు. దీంతో రూ.72 కోట్ల నిధులు బూడిదలో పోసిన పన్నీరైంది. రెండు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలి.

– రితేష్‌కుమార్, నాలా బాధితుల సంఘం అధ్యక్షుడు

దహన సంస్కారాలకు ఆర్థికసాయం


శ్మశానవాటిక ఇన్‌చార్జ్‌కు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

అంబర్‌పేట్: పేదల దహన సంస్కారాలకు తనవంతు చేయూతనిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. నియోజకవర్గంలో చనిపోయిన పేదల దహన సంస్కారాలకు గత ఐదేళ్లుగా ఆర్థికసాయాన్ని అందిస్తున్నామన్నారు. మంగళవారం అంబర్‌పేట శ్మశాన వాటికలో గత నెల 35 మంది దహన సంస్కారాలకు సంబంధించిన రూ.1.57 లక్షలను శ్మశానవాటిక ఇన్‌చార్జ్ కుమార్‌కు ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నిరుపేదలకు అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ్మా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజికవేత్తలు మహనీయుల స్ఫూర్తితో కేవీపీఎస్ కేలండర్‌ను రూపొందించడం అభినందనీయమని తెలంగాణ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా అన్నారు. మంగళవారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో కేవీపీఎస్– 2024 కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. కేవీపీఎస్ నిర్వహిస్తున్న సామాజిక ఉద్యమాలు ప్రజల్లో చైతన్యాన్ని కలిగిస్తున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ కోసం, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలుకు కేవీపీఎస్ చేసిన పోరాటం అభినందనీయమని కొనియాడారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, కేవీపీఎస్ నగర అధ్యక్షుడు దశరథ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈ ఫలితాలను ప్రకటించాలని ధర్నా


ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో ఏఈఈ మెరిట్ అభ్యర్థుల సంఘం ప్రతినిధులు

కవాడిగూడ: గతేడాది జనవరిలో నిర్వహించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్ష ఫలితాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి రిక్రూట్‌మెంట్ చేపట్టాలని ఏఈఈ మెరిట్ అభ్యర్థుల సంఘం ప్రతినిధులు అఖిలప్రియ, పవన్, సుమంత్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ఏఈఈ, ఏఈ, జూనియర్ లెక్చరర్ పాలిటెక్నిక్ లెక్చరర్స్ తదితర పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షా ఫలితాలను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ.. పరీక్ష రాసిన అభ్యర్థులు పెద్దఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఐఐటీ, ఓయూ, కేఎన్‌యూ వంటి ఉన్నత విద్యాసంస్థల్లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్, ఎంటెక్ పూర్తి చేసి గత ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ద్వారా 2022 సెప్టెంబర్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ద్వారా జనవరి 2023లో ఆన్‌లైన్ పద్ధతిలో ఓఎంఆర్ బేస్డ్ పరీక్ష రాశామని అదే ఏటా మార్చిలో పేపర్ లీకేజీల ఉదంతం వల్ల జనవరిలో రాసిన పరీక్షలను ప్రభుత్వం రద్దు చేయడంతో ఆత్మస్థైర్యం కోల్పోకుండా మే నెలలో ఆన్‌లైన్ పద్ధతిలో (కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్) పరీక్షలను రాశామని 2023 సెప్టెంబర్ టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన మెరిట్ లిస్టులో తామంతా ఉన్నామన్నారు. వెంటనే ఫలితాలు విడుదల చేసి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీకి నూతన బోర్డును నియమించి నియామకాలు చేపట్టడంలో ఉన్న న్యాయవివాదాలను తొలగించి వచ్చే పార్లమెంటు, పంచాయతీ ఎన్నికల కోడ్ కంటే ముందుగానే ఖాళీలను భర్తీ చేయాలని వారు డిమాండ్ చేశారు. సంఘం ప్రతినిధులు అఖిల్‌కుమార్, పవన్‌కుమార్, పృథ్వీరాజ్, అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కల్తీ ఆహారాల తయారీపై చర్యలు తీసుకోవాలి

స్వాభిమాన్ పరిషత్ డిమాండ్

హిమాయత్‌నగర్: రాష్ట్రాన్ని కల్తీరహితంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని స్వాభిమాన్ పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కిషోర్‌యాదవ్ డిమాండ్ చేశారు. కల్తీలేని ఆహారపదార్థాల నిషేధం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలతో కమిటీని ఏర్పాటు చేసి కల్తీ నిరోధానికి కృషి చేయాలని కోరారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడుతూ.. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్‌సీఆర్) లెక్కల ప్రకారం దేశంలోని 19 ముఖ్య నగరాల్లో కల్తీ ఆహార పదార్థాలపై 291 కేసులు నమోదు కాగా.. వీటిలో 246 కేసులు హైదరాబాద్‌లోనే నమోదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక రంగంలో దూసుకుపోతున్న నగరంలో అన్ని కల్తీతో కూడిన ఆహార పదార్థాలు తయారుచేయడం దారుణమన్నారు. కల్తీ ఆహారపదార్థాల తయారీకి పాల్పడుతున్న నిర్వాహకులపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపి కఠినంగా శిక్షించాలని, రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛ నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలకు కల్తీపై పూర్తిగా అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. పరిషత్ ప్రతినిధులు, న్యాయవాదులు సిరిగిరి ప్రభాకర్, ప్రమోద్, రాజేష్, వెంకటేష్, అనుప్ తదితరులున్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పించాలి

లిబర్టీ: అన్ని వర్గాల ఉన్నతాధికారులను ప్రభుత్వ పాలన అవసరాల కోసం నియమించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ విజ్ఞప్తి చేశారు. వివిధ ప్రభుత్వ శాఖలు ముఖ్య అధికారులను జిల్లా కలెక్టర్లను వివిధ కార్పొరేషన్ల అధికారులను అన్ని సామాజిక వర్గాలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. అధికారుల నియామకం సందర్భంగా ఒకే సామాజికవర్గానికి చెందిన అధికారులను నియమించకూడదని, ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ ఇలా అన్ని వర్గాలకు అధికారులను సముచిత స్థానం కల్పించాలని విన్నవించారు.

పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత



గాంధీఆస్పత్రి: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం కల్పించి, ఆస్పత్రి ప్రాంగణంలో ప చ్చందాలు పెంపొందించేందు కు కృషి చేస్తున్నామని గాంధీ సూపరింటెండెంట్ రాజారావు అన్నారు. గాంధీ ఆస్పత్రిలో మంగళవారం డైట్ కిచెన్, ఎంసీహెచ్ భవన పరిసర ప్రాంతాల్లో హరితహారం నిర్వహించి మొక్కలు నాటారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తే రోగులకు త్వరితగతిన స్వస్థత చేకూరే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని, మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఆర్ఎంఓ–1 జయకృష్ణ, చీఫ్ డైటీషియన్ రమేష్, డైట్‌కిచెన్ కాంట్రాక్టర్ రవికుమార్, జనరల్ మేనేజర్ వెంకటసంతోష్, ఆర్ఎంఓ యోగేందర్ పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జీవితం ఆదర్శనీయం


నివాళులర్పిస్తున్న జస్టిస్ నాగమారుతీ శర్మ, కళాజనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి: అంధులకు ఒక లిపిని రూపొందించిన లూయిస్ బ్రెయిలీ జీవితం ప్రతి ఒక్కరికీ ప్రేరణనిస్తుందని సీబీఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతీశర్మ అన్నారు. మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికపై శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా గానసభ నిర్వహణలో లూయిస్ బ్రెయిలీ సంస్మరణ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళుల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంధులు చదువుకు దూరమవుతున్నారన్న వేదనతో బ్రెయిలీ వారి కోసం ప్రత్యేక లిపిని కనిపెట్టి ఆశాజ్యోతిగా వారి జీవితాలను వెలుగులమయం చేశారని వివరించారు. పరులకోసం పాటుపడే వారు నిత్యస్మరణీయులన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి, కొల్లి నాగేశ్వర్‌రావు, శంకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్వో ప్రాజెక్ట్ డైరెక్టర్ అచ్చిరెడ్డికి సన్మానం


సన్మానిస్తున్న వీఆర్ఏ హక్కుల సాధన సమితి చైర్మన్ విజయ్

కవాడిగూడ: సీఎంఆర్వో ప్రాజెక్టు డైరెక్టర్ (సీపీఎల్ఏ)గా బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ కలెక్టర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.అచ్చిరెడ్డిని మంగళవారం వీఆర్ఏ హక్కుల సాధన సమితి చైర్మన్ ఆర్.విజయ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. రెవెన్యూ వ్యవస్థపై పూర్తి పట్టున్న అచ్చిరెడ్డికి సీపీఎల్ఏ డైరెక్టర్ పదవి అప్పగించడం శుభపరిణామమని, తద్వారా రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం అభినందనీయన్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని రైతులందరికీ న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హక్కుల సాధన సమితి నాయకులు సత్యనారాయణ, సతీష్, చిరంజీవి, అశోక్, శివరాం తదితరులున్నారు.

అద్దె చెల్లించని షాపులపై చర్యలు


నోటీసులు అంటించిన దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించిన దుకాణదారులు అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో ఎండోమెంట్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు మంగళవారం ఖాళీ చేయించారు. సహాయ కమిషనర్ ఏ.బాలాజీ, ఇన్‌స్పెక్టర్ సురేఖ, సురేందర్‌రావు, దేవాలయం ఈఓ రామాంజనేయులు, ఆలయ వ్యవస్థాపక వంశీయుడు కుమారుడు శ్రీనాథ్‌గౌడ్ పర్యవేక్షణలో చిక్కడపల్లి– 1 పోలీసుల బందోబస్తు మధ్య శాఖ సిబ్బంది మూడు షాపులను ఖాళీ చేయించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. అద్దెకు సంబంధించిన బకాయిలు చెల్లించకపోవడంతోనే మొత్తం నాలుగు షాపులను తొలగించాలని ఎండోమెంట్ ట్రిబ్యునల్ ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఇందులో రేషన్‌షాపు ఉండడంతో గడువు ఇచ్చామన్నారు. మిగతా మూడు షాపులను ఖాళీ చేయించి నోటీసులు అంటించామన్నారు.

రాధిక మంగిపూడి సాహిత్యంలో ఆత్మీయత అనుభూతి

చిక్కడపల్లి: రాధిక మంగిపూడి రచనలు అనుభూతి ఆత్మీయతతో కూడి మానవతా విలువలు పెంచేవిగా ఉంటాయని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాదీక్షితులు కళావేదికపై వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో నెల నెలా తెలుగు వెన్నెల 178వ కార్యక్రమంలో భాగంగా రాధిక మంగిపూడి రచనలపై జరిగిన సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వంగూరి చిట్టెన్ రాజు అమెరికాలో స్థిర పడినా తెలుగుభాషకు ఆయన ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న సేవ అద్వితీయమని కొనియాడారు. రెండు సంబంధాలు అద్భుత సాహిత్య సృష్టికి రెండు దేశాల మధ్య సంబంధాలు మానవచైతన్యం, మనుషుల మధ్య సన్నిహితం మానవత్వానికి మార్గమని విశ్లేషించారు. రాధిక వివిధ ప్రక్రియల్లో ఉత్తమ రచనలు చేశారన్నారు. అధ్యక్షత వహించిన వంశీ రామరాజు మాట్లాడుతూ.. వచ్చే మార్చి నెలలో అఖిల భారత సాహితీ సదస్సులు కాకినాడలో వంగూరి ఫౌండేషన్ నిర్వహణలో నిర్వహించుకుంటామన్నారు. అనంతరం తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య గౌరీశంకర్, సినీకవి డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, జర్నలిస్ట్ శంకర నారాయణ, రచయిత్రి డాక్టర్ తిరునగరి దేవకీదేవి, రాజ్యశ్రీలు వరుసగా రాధిక రచనలు భారతీయ తత్త్వశతకం, నవ కవితా కదంబం, అలా సింగపురంబులో మరో మయాబజార్ భావ తరంగాలపై ఆసక్తికర విషయాలను వివరించగా.. శైలజ సుంకరపల్లి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సంస్థ అభివృద్ధిలో ఆర్టీసీ సిబ్బంది కీలకం


బర్కత్‌పుర బస్‌డిపోలో వనభోజనంలో ఆర్ఎం వరప్రసాద్

అంబర్‌పేట్: ఆర్టీసీ కార్మికుల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొల్పడానికి ఆర్టీసీ కృషి చేస్తోందని ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు. మంగళవారం బర్కత్‌పుర ఆర్టీసీ డిపోలో జరిగిన వనభోజన కార్యక్రమానికి ఆయన డిపో మేనేజర్ వేణుగోపాల్‌తో కలిసి హాజరై, కార్మికులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. ఆర్టీసీ సంస్థ అందించే మెరుగైన సేవల్లో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు. డిపో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి సహకారంతో మంగళవారం సుందరయ్యపార్కులో జరిగిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రూపుల వివేక్ మాట్లాడుతూ.. వాకర్స్ ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతివారం ఉచితంగా నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు హార్ట్, కొలెస్ట్రాల్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, రాయపాటి రవిమాదిగ, ప్రకాష్, కృష్ణా తదితరులున్నారు.

మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ పద్మ


అంబర్‌పేట్: మౌలిక సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తున్నట్లు బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని మందుల బస్తీలో డ్రైనేజీ పైపులైన్‌పనులు, అంతర్గత రోడ్ల ప్యాచ్‌వర్క్స్ పనులను పరిశీలించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కారించాలని ఆమె సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రత్యేక పూజలు



నల్లకుంట: న్యూనల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి దేవాలయ ప్రాంగణం భక్తుల జగన్మాత నామస్మరణలతో మార్మోగింది. మంగళవారం సర్వమంగళ దేవతా స్వరూపములను వివిధ రకాల పూలమాలలతో అలంకరించి, ఆలయ అర్చకస్వాములు సీతారామశర్మ, జ్ఞానేశ్వర్‌ల మంత్రోచ్చరణ మధ్య శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. సామూహికంగా నిర్వహించిన పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వారికి తీర్థ, ప్రసాద చేశారు.

టూరిజం నూతన సీఎండీకి శుభాకాంక్షలు



హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు నూతనంగా సీఎండీగా నియమితులైన ఐపీఎస్ కె.రమేష్ నాయుడికి ఆ శాఖ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని టూరిజం కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు వి.ఎస్.బోస్, ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జ్యోతి, రమేష్‌బాబు, శ్రీను, నాసర్ అలీ, హైమా, రచన, మధురారెడ్డి, నేత్ర, రాజలక్ష్మి, మోజిద్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి


సైన్స్ ఫెస్టివల్‌లో పాల్గొన్న అంబేడ్కర్ విద్యాసంస్థల విద్యార్థులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సైన్స్‌పై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అంబేడ్కర్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వివేక్‌వెంకటస్వామి అన్నారు. మంగళవారం ఐఎస్ఆర్ఓ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లోని ఎస్ఆర్ఎస్ఈ క్యాంపస్‌లో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు అంబేడ్కర్ కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులు, స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివేక్‌వెంకటస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులు సాఫ్ట్‌వేర్ వైపే కాకుండా అంతరిక్ష రంగంపై కూడా ఆసక్తి పెంచుకుంటున్నారన్నారు. ఇటీవల ఇస్రో చేపట్టిన ప్రయోగాలను తమ విద్యార్థులు అక్కడ జరిగిన సైన్స్ ఫెస్టివల్‌లో అవగాహన పెంచుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు అనేక అంశాలపై తమ కళాశాలలో శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రొ.నవీన్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ వసుంధర, స్కూల్ హెచ్ఎం విఠలాచారి, అడ్మిన్ అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఏసీపీ శంకర్

అంబర్‌పేట్: ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్ తెలిపారు. మంగళవారం బర్కత్‌పురలోని శ్యామలాదేవి జూనియర్ బాలికల కళాశాలలో ట్రాఫిక్‌పై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్ల నిండని యువత వాహనాలు నడపొద్దని, నడిపితే భారీ జరిమానా ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థులు నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. ట్రాఫిక్ అధికారులు, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.